క్లుప్తంగా

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ఊరేగింపు



హంసవాహనంపై కొలువుదీరిన శ్రీవల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

విజయనగరం టౌన్: నగరంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహ ఊరేగింపు అంగరంగ వైభవంగా ఆదివారం నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ స్వామి వారి ఆలయం నుంచి కొత్తపేట నీళ్లట్యాంకు, మూడులాంతర్ల జంక్షన్, కోట, గంటస్తంభం, కన్యకాపరమేశ్వరి ఆలయం, పాతబస్టాండ్ మీదుగా ఆలయం వరకు జరిగిన ఈ ఊరేగింపులో హంసవాహనంపై కొలువుదీరిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని భక్తులు దర్శించుకుని, విశేష పూజలు చేశారు. స్వామి వారి జన్మనక్షత్రం ఆడికృతిక పురస్కరించుకుని, ఈ కార్యక్రమం చేయడం జరిగిందని ఆలయ వ్యవస్థాపకులు కర్రి వెంకటరమణ సిద్ధాంతి తెలిపారు.

ఇంటింటికీ 'బాబు' మోసాలు



రామతీర్థంలో కరపత్రాల పంపిణీ ద్వారా కూటమి మోసాలను ప్రజలకు వివరిస్తున్న సర్పంచ్ సూర్యకళ, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థం పంచాయతీలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. సర్పంచ్ కంచరాపు సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలంతా ఇంటింటికీ వెళ్లి సీఎం చంద్రబాబు ప్రజలను మోసగిస్తున్న తీరును వివరించారు. పథకాలు పూర్తిగా అమలు చేయకుండా ఏ విధంగా కాలయాపన చేస్తున్నారో క్షుణ్ణంగా తెలిపారు. అలాగే గతంలోని వైఎస్సార్ సీపీ పాలనకు, ఇప్పటి కూటమి పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను ప్రజలే గ్రహించేలా చైతన్యం చేస్తున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కంచరాపు రాము, నరేష్, చంటి పాల్గొన్నారు.

నేటి నుంచి పూసపాటిరేగలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'



పి.అప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు

పూసపాటిరేగ: మండలంలో సోమవారం నుంచి బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీకార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు ఆదివారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం రెల్లివలస, చల్లవానితోట, కుమిలి, బత్తివలస, సీహెచ్ అగ్రహారం, పూసపాటిరేగ, కొవ్వాడ అగ్రహారం గ్రామాల్లో కొనసాగుతుందన్నారు. నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొని, చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న ప్రజలను మోసగిస్తున్న తీరును వివరిస్తారన్నారు. మండల స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు..



మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర సాధన సమితి కన్వీనర్ వేమిరెడ్డి

బొబ్బిలి: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయని, రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే ఈ ప్రభుత్వంలో కనీసం చలనం లేదని ఉత్తరాంధ్ర సాధన సమితి కన్వీనర్ వేమిరెడ్డి లక్ష్మున్నాయుడు విమర్శించారు. బొబ్బిలిలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పంటలను సాగు చేస్తుంటే ప్రభుత్వం కనీసం గిట్టుబాటు ధర అందించడం లేదని మండిపడ్డారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయడంలో ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయని, రైతుల ఆత్మహత్యలను ప్రభుత్వం చులకనగా చూస్తూ నష్టపరిహారం కూడా అందించడం లేదని ఆరోపించారు. ఏడాదికి రూ.20 వేలు సాగు పెట్టుబడి సాయం అందిస్తామని కూటమి పెద్దలు హామీ ఇచ్చారని, గత ఖరీఫ్‌లో సాయం అందలేదని, ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలల గడుస్తున్నా నేటికీ సాయం అందలేదన్నారు. 20వేల రూపాయలు సాగుపెట్టుబడి సాయం అందిస్తామని ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీ ఏమైందో పాలకులు రైతులకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుల నుంచి భూములను బలవంతగా సేకరించి కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్న దగాకోరు ప్రభుత్వంపై రైతులు తిరగబడి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. వజ్జి రమేష్, రవికుమార్, నారాయణరావు పాల్గొన్నారు.

జగన్, చంద్రబాబు పాలనల్లో తేడాను గమనించండి

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి



బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల, తదితరులు

విజయనగరం: అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఇప్పటి సీఎం చంద్రబాబు పాలనల్లో తేడాను గమనించాలని, జగన్ తనను నమ్మి ఓట్లు వేసిన వారికి న్యాయం చేస్తే..చంద్రబాబు మాత్రం ఆయనను నమ్మి ఓట్లు వేసిన వారికి అన్యాయం చేస్తున్నారని ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి విమర్శించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నగరంలోని 30వ డివిజన్ ధర్మపురిలోని రామమందిరం వద్ద ఆదివారం జరిగిన సభలో ఆయన పాల్గొని, కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగట్టారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం దాటినా ఇప్పటివరకు ఏ ఒక్క పథకమూ పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. గతంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనూ అన్ని పథకాలు అమలు చేశామని గుర్తు చేశారు. అధికారంలో ఉన్నా లేకున్నా వైఎస్సార్ సీపీ ఎప్పుడూ ప్రజల వైపే ఉంటుందని, ప్రజలకు అన్యాయం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఎన్నికలప్పుడు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేంతవరకు తమ పోరాటం ఆగదన్నారు. ఇప్పటివరకు కూటమి సర్కారు ఇచ్చామని చెప్పుకుంటున్న గ్యాస్ పథకం, తల్లికి వందనం పథకాల్లోనూ ప్రజలకు మోసమే జరిగిందన్నారు. తొలుత ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పారని, ఆఖరికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లేనని అబద్ధాలు ఆడుతున్నారన్నారు. చాలా మందికి గ్యాస్ డబ్బులు కూడా పడలేదన్నారు. అలాగే తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు ఇస్తామని, చివరకు రూ.13 వేలు అది కూడా కొద్ది మందికే ఇచ్చారన్నారు. చాలా మందికి రూ.13 వేలకు బదులు కేవలం రూ.10 వేలు మాత్రమే వేసి చేతులు దులిపేసుకున్నారన్నారు. వారు అరకొరగా అమలు చేసిన ఒకట్రెండు పథకాలు చూసి పథకాలన్నీ అమలు చేసేసినంతగా గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. జగనన్న ప్రభుత్వంలో ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయడం జరిగిందన్నారు. అర్హులందరికీ కుల, మత, రాజకీయ పార్టీల కతీతంగా పథకాలు అందాయన్నారు. అన్ని వర్గాల వారికి సంక్షేమ ఫలాలు అందించిన ఏకైక ప్రభుత్వంగా జగనన్న ప్రభుత్వమే పేరొందిందన్నారు. ప్రజలంతా గమనిస్తున్నారని అప్పటి పాలనకు, ఇప్పటి పాలనకు ఉన్న తేడాను గుర్తుకు తెచ్చుకుంటున్నారన్నారు.

పథకాలు కట్ చేస్తామనడం దుర్మార్గం..

నిరుద్యోగులకు ఉద్యోగాలు కాదు కదా కనీసం నిరుద్యోగ భృతి కూడా ఇవ్వలేదని, మహిళలకు ఇస్తామన్న ఉచిత బస్సు, నెలకు రూ.1500లు వంటి పథకాలేవని, బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ వంటి పథకం ఎక్కడని నిలదీశారు. పరిపాలనలో కూటమి ప్రభుత్వం ఘోరవైఫల్యం చెందిందన్నారు. ఇదిలా ఉంటే ప్రతిపక్ష పార్టీ సమావేశాలకు హాజరైతే పథకాలు కట్ చేస్తామని కూటమి నాయకులు బెదిరించడం దుర్మార్గమన్నారు. దమ్ముంటే పథకాలు ఆపాలని సవాలు విసిరారు. ఇదే నియోజకవర్గం నుంచి తాను ఎమ్మెల్యేగా రెండు సార్లు గెలుపొందానని, తానెప్పుడూ ప్రజల్లోనే ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకునేవాడినన్నారు. ఇదే ధర్మపురిలో తన హయాంలో రెండు తాగునీటి ట్యాంకులు నిర్మించానని, ధర్మపురి నుంచి కొత్త ధర్మపురికి రోడ్డు నిర్మించానని, వీధి దీపాలు ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ఎప్పటికైనా తామే, తమ పార్టీయే ప్రజల పక్షాన నిలుస్తుందని, వారికి అన్యాయం జరిగితే వారి గొంతుకై ప్రశ్నిస్తుందన్నారు. ప్రజలు రాజకీయంగా చైతన్యవంతులు కావాలని, కూటమి నాయకులు, ఆ ప్రభుత్వం చేస్తున్న మోసాలను పసిగట్టాలని, వారు చేసే కక్ష, కుట్రపూరిత రాజకీయాలను నిలదీయాలని కోరారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ బ్రోచర్లు పంపిణీ చేసి, ఏడాది కూటమి పాలనలో ప్రజలకు జరిగిన అన్యాయాన్ని తెలియజేశారు. ఆ తర్వాత ఆయన 30వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు పూసర్ల శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు చందక ఆదిలక్ష్మి, యువజన విభాగం అధ్యక్షులు సువ్వాడ జయరాం, బీసీ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన చందక సూరిబాబులను సత్కరించారు. సమావేశంలో కార్పొరేటర్ పతివాడ గణపతి, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టి వీర వెంకటరాజేష్, పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ప్రజలు

చంద్రబాబు..మోసానికి బ్రాండ్ అంబాసిడర్



కూటమి మోసాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: తనను నమ్మి ఓట్లేసిన జనానికి మోసం చేయడం చంద్రబాబు నైజమని, ఆయన మోసానికి బ్రాండ్ అంబాసిడర్ అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బడ్డుకొండ అప్పలనాయుడు విమర్శించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మొయిద గ్రామంలో ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబుతో కలిసి ఆదివారం పర్యటించిన ఆయనకు గ్రామస్తుల నుంచి సాదరస్వాగతం లభించింది. అనంతరం జరిగిన సభలో ఆయన కూటమి ప్రభుత్వ మోసాలపై మండిపడ్డారు. ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవాలన్న ఆశతో జనసేన, బీజేపీలతో జతకట్టి అమలుసాధ్యం కాని హామీలు ఇచ్చారని, తీరా అధికారంలోకి వచ్చాక వాటి అమలు గాలికొదిలేయడం నయవంచనేనన్నారు. ఇప్పటివరకు అమలు చేసిన ఒకట్రెండు పథకాలు కూడా వైఎస్సార్ సీపీ పోరాట ఫలితమేనన్నారు. తమ పార్టీ నిలదీస్తేనే ప్రజలకు ఆ పథకాలు కూడా వచ్చాయని లేకుంటే పూర్తిగా ఎగ్గొట్టే ప్రయత్నం జరిగేదన్నారు. వారిచ్చిన హామీలు అమలు చేయాలని ప్రజలు ఎక్కడ నిలదీస్తారోనని భావించి, కూటమి నాయకులు ప్రజల వద్దకు వెళ్లేందుకు భయపడుతున్నారన్నారు. దమ్ముంటే ఎన్ని పథకాలు పూర్తి స్థాయిలో అమలు చేశారో చెప్పాలని సవాలు విసిరారు. ఇప్పటికీ గ్యాస్ డబ్బులు కొంతమంది పడలేదని, తల్లికి వందనం డబ్బులు కూడా చాలామంది తల్లుల ఖాతాల్లో జమ కాలేదన్నారు. అక్కడ ప్రభుత్వం.. ఇక్కడ ఎమ్మెల్యే లోకం నాగమాధవి కూడా ప్రజలను వంచించడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. తానొస్తే నిరుద్యోగులకు వంద రోజుల్లో ఉద్యోగాలిస్తామని చెప్పిన ఎమ్మెల్యే.. ఇంతవరకు ఎందుకు ఉద్యోగాలివ్వలేదో చెప్పాలని నిలదీశారు. అటు రాష్ట్ర ప్రజలకు గానీ, ఇటు నియోజకవర్గ ప్రజలకు గానీ మంచి ఎప్పుడైనా జరిగిందంటే అది వైఎస్సార్ సీపీ హయాంలోనేనని గుర్తు చేశారు. ఏ గ్రామానికి వెళ్లినా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, రోడ్లు, కాలువలు, మంచినీటి సదుపాయాలు తదితర వాటి రూపంలో మనం చేసిన మంచి కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గదల సన్యాసినాయుడు, నెల్లిమర్ల నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, వైస్ ఎంపీపీ సారిక వైకుంఠం, ఎంపీటీసీ పెనుమత్స సంతోష్‌బాబు, సీనియర్ నేతలు మత్స సత్యనారాయణ, రేగాన శ్రీనివాసరావు, జమ్ము అప్పలనాయుడు, గేదెల రామచిరంజీవి, పెనుమత్స అప్పలరాజు, అంబళ్ల కిరణ్, మత్స శ్రీనివాసులనాయుడు, లెంక గోవింద పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ, తదితరులు

జగనన్నతోనే అభివృద్ధి, సంక్షేమం: ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు



రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం ఒక్క జగనన్నతోనే సాధ్యమని, ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అర్హులందరికీ కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందివ్వడం జరిగింది. అన్ని వర్గాల వారు అన్ని విధాలా లబ్ధి పొందింది ఏ ప్రభుత్వ హయాంలోనైనా ఉందంటే అది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే. ఇప్పుడిప్పుడే ప్రజలు వాస్తవాలు గ్రహిస్తున్నారు. చంద్రబాబు మోసపూరిత హామీలకు ఆకర్షితులమై తప్పు చేశామంటూ ఒప్పుకుంటున్నారు. తన తండ్రి దివంగత మాజీ మంత్రి సాంబశివరాజుతో పాటు తన హయాంలో కూడా మొయిద ప్రజలంతా ఏకతాటిపై ఉన్నారు. కొంతమంది కావాలనే గొడవలు సృష్టించాలని చూస్తున్నారు అప్రమత్తంగా ఉండాలి. వివాదాలకు తావునివ్వకుండా శాంతియుత వాతావరణంలో మెలగాలి.

రైతుబజారు కొనసాగించాలి



మాట్లాడుతున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు

- పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు

విజయనగరం గంటస్తంభం: పాత మహారాజా ఆస్పత్రి వద్ద ఉన్న రైతుబజారును అక్కడే కొనసాగించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన ఆ బజారు వద్ద ఆదివారం నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఈ బజారు స్థలం రాజులది కాదని, 1922 నుంచి అది ప్రభుత్వ స్థలమేనని, దానిని అశోక్ గజపతిరాజు కాజేయాలని చూడడం సరికాదన్నారు. 1922 నుంచి 1995 వరకు ఇక్కడ మహారాజా ప్రభుత్వ ఆస్పత్రి కొనసాగిందని, 1995లో దాన్ని వేరే చోటుకి తరలించారన్నారు. 1995 నుంచి 1999 వరకు ఖాళీగా ఉన్న స్థలం ప్రైవేట్‌ది అయితే 1999లో ఇదే అశోక్‌గజపతిరాజే రైతుబజారును ఎలా ప్రారంభించారని ప్రశ్నించారు. ఇది మహారాజా వారి వారసుల స్థలం అనడానికి ఎటువంటి ఆధారాలు లేవని 2018లో టీడీపీ ప్రభుత్వమే సీసీఎల్ఏ ఆఫీస్ నుంచి జీవో ఇచ్చిందన్నారు. 26 ఏళ్లుగా ప్రభుత్వ స్థలంలో నడుస్తున్న రైతు బజారుని ఎత్తేసి రైతుల బతుకు రోడ్డున పడేయడం అన్యాయమన్నారు. ఇక్కడే రైతు బజారు కొనసాగించి, మిగతా స్థలం ప్రభుత్వం ఆఫీస్‌లకి ఉపయోగించాలన్నారు. ఈ సమస్య పరిష్కారానికి సోమవారం చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టి ధర్నా చేస్తున్నట్లు పేర్కొన్నారు. తమ ఈ పోరాటంలో అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. ఆయన వెంట రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు. ఉత్తరంధ్ర అభివృద్ధి వేదిక జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాస, కేవీపీస్ జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్, రైతులు పాల్గొన్నారు.

కూటమికి ప్రజలే బుద్ధి చెబుతారు..

నెల్లిమర్ల రూరల్: రాష్ట్రంలో ప్రజాపాలనను గాలికొదిలేసి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ కుట్రపూరిత రాజకీయాలు కొనసాగిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని, ఆ రోజులు దగ్గరలోనే ఉన్నాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు ఓ ప్రకటనలో ఆదివారం విమర్శించారు. ఎటువంటి ఆధారాలు లేకపోయినా ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారని ఖండించారు. వారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో సృష్టిస్తున్న అరాచకాలను ప్రజలంతా గమనిస్తున్నారని రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని జోష్యం చెప్పారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదన్న విషయం గుర్తెరిగి ప్రజలందరికీ న్యాయం జరిగేలా ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని హితవుపలికారు. ప్రజల్లో ప్రభుత్వానికి ఉన్న వ్యతిరేకతను మరిపించేందుకే ఈ అక్రమ అరెస్టలని, ఎంపీ మిథున్ రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

మిథున్‌రెడ్డి అరెస్ట్ అక్రమం

చీపురుపల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు ఆరోపించారు. ఈక్రమంలోనే మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాది కాలంగా ఎంపీ మిథున్‌రెడ్డితో పాటు ఆయన తండ్రి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పట్ల కూడా కూటమి నేతలు అనుచితంగా వ్యవహరిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికు అత్యంత సన్నిహితులుగా ఉంటున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డిలపై నిరాధార ఆరోపణలు తప్ప ఒక్కటి కూడా నిరూపించలేకపోయారని తెలిపారు. రాజంపేట పార్లమెంట్ పరిధిలో మిథున్ రెడ్డి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తుండడం చూసి కూటమి ప్రభుత్వానికి కన్ను కుట్టిందన్నారు. అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్న వారికి రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు

- రెడ్‌బుక్ రాజ్యాంగం పేరిట కూటమి అరాచకాలు బాధాకరం
- ప్రజాస్వామ్యంలో ఆడబిడ్డలను దూషించే హక్కు ఎవరిచ్చారు?
- నగరి ఎమ్మెల్యేను తక్షణమే ఆ పార్టీ సస్పెండ్ చేయాలి
- కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



మాట్లాడుతున్న విజయనగరం మేయర్, డిప్యూటీ మేయర్లు విజయలక్ష్మి, శ్రావణి

విజయనగరం: రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, ప్రధానంగా మహిళలకు రక్షణ కరువైందని స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణిలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయమై వారు నగరంలో ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి నివాసం వద్ద ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రెడ్‌బుక్ రాజ్యాంగం పేరిట కూటమి ప్రభుత్వం సృష్టిస్తున్న అరాచకాలు బాధాకరమన్నారు. గడిచిన ఆ ప్రభుత్వ 13 నెలల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది మహిళలపై దాడులు, అఘాయిత్యాలు జరిగినా పట్టించుకునే నాథుడే లేడన్నారు. అసలు ఈ రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా లేదా అనే అనుమానం అందరిలో కలుగుతోందన్నారు. దేశంలోని రాష్ట్రాల్లో ఈ రాష్ట్రంలో తప్ప మిగతా అన్ని రాష్ట్రాల్లో మహిళల భద్రతకు అక్కడి ప్రభుత్వాలు భరోసానిస్తున్నాయని, ఇక్కడి ప్రభుత్వం మాత్రం అలా చూస్తుండడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యంలో దేని గూర్చి అయినా అభిప్రాయం వ్యక్తపరిచే హక్కుంది కానీ, ఇష్టానుసారంగా ఆడబిడ్డలను దూషించే హక్కు లేదన్నారు. రాజ్యాంగంలో లేని ఈ తరహా హక్కును రెడ్‌బుక్ రాజ్యాంగం ద్వారా మీ పార్టీ అధినాయకత్వం మీకు కల్పించిందా.. అందుకే మీరు నోటికి వచ్చిందల్లా మాట్లాడేస్తున్నారా అని కూటమి నాయకులను ప్రశ్నించారు.

గౌరవమూ లేదు.. భద్రతా లేదూ..

మాజీ మంత్రి ఆర్‌కే రోజాపై నగరి ఎమ్మెల్యే భాను ప్రకాష్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ అండదండలతోనే టీడీపీ నాయకులు రెచ్చిపోతున్నారని, ఇష్టం వచ్చినట్లు మాట్లాడేస్తున్నారని మండిపడ్డారు. కూటమి గద్దెనెక్కిన దగ్గర నుంచి ఆడబిడ్డలకు గౌరవం లేదు కదా కనీసం భద్రత కూడా లేదని ధ్వజమెత్తారు. ఓ మాజీ ప్రజాప్రతినిధినే ఇలా అవమానపరిస్తే ఇక సామాన్య ఆడబిడ్డ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. తక్షణమే నగరి ఎమ్మెల్యే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల భద్రత పట్ల సీఎం చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే అటువంటి వ్యక్తులను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. అంతేకాకుండా కక్షపూరిత రాజకీయాలతో గుడ్లవల్లేరులో ఓ మహిళను చెట్టుకు కట్టేసిన పరిస్థితి కూడా మనం చూశామన్నారు. మెడికల్ కళాశాల విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జికి పాల్పడ్డారని, కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన మూకలు దౌర్జన్యం చేయడం నిజం కాదా అని నిలదీశారు. రాష్ట్రంలో ఓ మహిళా నాయకురాలు హోంమంత్రిగా ఉండగా ఆడబిడ్డలపై ఇటువంటి దారుణాలు చేస్తుండడం విచారకరమన్నారు. 2024 ఎన్నికలకు ముందు ఏ ఒక్క మహిళకు అన్యాయం జరిగినా, ఏ ఒక్కరినీ అకారణంగా దూషించినా వేధించినా ప్రశ్నిస్తానన్న పవన్‌కల్యాణ్ ఆయన ప్రభుత్వ హయాంలోనే ఇంతటి దారుణాలు జరుగుతున్నా ఎందుకు స్పందించడం లేదో చెప్పాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి దుప్పాడ సునీత, కార్పొరేటర్లు ఆల్తి సత్యకుమారి, పిన్నింటి కళావతి, తాళ్లపూడి సంతోషి తదితరులు పాల్గొన్నారు.